క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ


సర్టిఫికెట్‌లతో శిక్షణ పూర్తయిన విద్యార్థులు

పాయకరావుపేట : కనోస్సా పాఠశాల విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ లో 3 నెలల పాటు శిక్షణ కల్పించడం జరిగిందని అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ జి.ఘనీ తెలిపారు. విద్యార్థులకు 3 నెలల పాటు శిక్షణ పూర్తి చేసి, సర్టిఫికెట్‌లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా, పిజిటి శ్రీను పాల్గొన్నారు.

శివాలయాలలో విశేష పూజలు

కోటవురట్ల: మహాశివరాత్రిని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్న భక్తులు శివాలయాల్లో సోమవారం విశేష పూజలు చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నసమారాధనలు నిర్వహించారు. యండపల్లి శివారు వరాహనది తీరాన ఉన్న శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో యండపల్లి, జల్లూరు, బి.కె.పల్లి, సుంకపూరు, తంగేడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

26న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా 26న ఉదయం నుంచి మూలవిరాట్‌కు అభిషేక కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఆలయ నిర్వాహకుడు వేగి లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మునగపాక అభివృద్ధికి కృషి

మునగపాక : మునగపాక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాకలో జరుగుతున్న పిచికారీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. కాలువల్లో దోమలు లేకుండా ఉండేందుకు బ్లీచింగ్ పిచికారీ చేయిస్తున్నామన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి పారిశుద్ధ్యం మెరుగునకు కృషి చేస్తామన్నారు.

హతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం


ప్రవీణ్‌కుమార్ తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాపు సంక్షేమసేన సభ్యులు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డులో దారుణ హత్యకు గురైన దంటు ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులను సోమవారం కాపు సంఘ నాయకులు పరామర్శించారు. మృతుడు ప్రవీణ్‌కుమార్ తల్లి సత్యను ఓదార్చి రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాపు సంక్షేమ యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లింగపల్లి జ్యోతికుమార్, నాయకులు కోరెడ్డి సుబ్బారావు, నాగేశ్వరరావు, నగిశెట్టి గంగబాబు, కరణం కళావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపమాక వెంకన్న పెళ్లిరాట

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 22న బుధవారం పెళ్లిరాట వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. పాల్గుణ శుద్ధ ఏకాదశి (మార్చి 3వ తేదీన) స్వామివారి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పెళ్లిరాట కార్యక్రమానికి ఈనెల 22వ తేదీన ఉదయం 7.58 గంటలకు ముహూర్తంగా తిరుమల తిరుపతి దేవస్థాన ఆగమ శాస్త్ర పండితులు నిర్ణయించారన్నారు.

సీతంరాజును గెలిపిద్దాం

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- యలమంచిలిలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష


యలమంచిలిలో కార్యకర్తలు నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. సోమవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యలమంచిలి మండలం, పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన సుధాకర్ పార్టీకి విధేయుడుగా పనిచేస్తున్నారని అన్నారు.

యలమంచిలి నియోజకవర్గంలో 5,900మంది పట్టభద్రులు ఉన్నారని, పట్టణంలో 2300 మంది పట్టభద్రులు ఉన్నారని ప్రతి ఒక్క పట్టభద్రుడిని కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని గురించి వివరించి వారి మద్దతు పార్టీ అభ్యర్థికి ఉండేటట్లు చూడాలని అన్నారు. యలమంచిలి నియోజకవర్గం నుండి అత్యధిక ఓట్లు పోలయ్యేలా చూడాలని 10 మంది సభ్యులతో ఒక కమిటీగా ఏర్పడి పట్టభద్రుల వివరాలు సేకరించి వారితో స్వయంగా కలసి వివరించాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ ఇటీవలే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వచ్చినప్పుడు యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అద్భుతంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రమణమూర్తిరాజును అభినందించారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అవినీతికి తావులేని పాలన అందిస్తున్నారని ప్రతి ఉద్యోగికి, పట్టభద్రునికి వివరించాలని అన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఫొటో పక్కన మొదటి ప్రాధాన్యతా ఓటును వేయాలని ప్రతి ఒక్కరికి ఓటింగ్ పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీటీసీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ యర్రయ్యదొర, రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి త్రినాథ్, సచివాలయ పట్టణ కన్వీనర్ కర్రి శివ. సేనాపతి రాము పాల్గొన్నారు. కాగా యలమంచిలి పట్టణంలో ఉన్న వాలీబాల్ క్రీడాకారులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను సోమవారం అందజేశారు.


ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఏటికొప్పాక జనసేన నాయకులు

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు

యలమంచిలి : ఏటికొప్పాక గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు సోమవరం యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన గొంతుమూర్తి ప్రభాకర్, కుప్పిన బాబ్జీ జనసేన పార్టీలో క్రియాశీలక కార్యకర్తలుగా ఉన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త సేనాపతి రాము ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటికొప్పాక గ్రామమే కాకుండా యలమంచిలి నియోజకవర్గంలో మరిన్ని చేరికలు త్వరలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, ఎంపీపీ గోవింద్, ఏటికొప్పాక నాయకుడు కరణం రవి పాల్గొన్నారు.

గృహ సారథులే పార్టీ విజయ సారథులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు


హాజరైన పార్టీ నాయకులు, గృహ సారథులు

కోటవురట్ల : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వైఎస్సార్‌సీపీ విజయసారథులు కావాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కలిగే లబ్ధిని వివరించి ఆ ఇంటి తలుపుపై వారి అంగీకారంతో స్టిక్కర్ అందించాలన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే భవిష్యత్ అని అర్థమయ్యేలా వివరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మహిళా పక్షపాతి అని చెబుతూ సంక్షేమ పథకాల్లో అధికంగా మహిళలకే అందించడంతో పాటు పదవులు కూడా 50 శాతం మహిళలకే దక్కేలా చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ స్థానాలు కూడా 11 మంది బీసీలకు కేటాయించి తన అభిమానాన్ని చాటారన్నారు. రాష్ట్రంలో 5.2 లక్షల మందికి గృహ సారథులుగా బాధ్యత అప్పగించారని, కోటవురట్ల మండలంలో 752 మంది గృహ సారథులు ఉన్నారని వారంతా ఇప్పటి నుంచే పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, మండల కన్వీనర్ పైల రమేష్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వి.రాంబాబు, పార్టీ నాయకులు సత్యనారాయణ, కిషోర్, బూత్ కమిటీ కన్వీనర్ రమణమూర్తి పాల్గొన్నారు.

ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలి


ఖైదీలకు పెడుతున్న ఆహారాన్ని రుచి చూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి


సబ్ జైల్‌కు ఫ్రిజ్, ఫ్యాన్లు వితరణ చేస్తున్న హెల్ప్ ఆర్గనైజేషన్ సభ్యుడు వేమిశెట్టి కృష్ణ

- యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

యలమంచిలి : సబ్ జైల్‌లో ఖైదీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. న్యాయశాస్త్ర అవగాహన సదస్సులో భాగంగా మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో యలమంచిలి సబ్ జైల్‌ను సోమవారం సాయంత్రం సందర్శించారు. సబ్‌జైల్లో ఖైదీలకు పెడుతున్న ఆహారాన్ని రుచి చూశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారంలో నాణ్యతా లోపం ఉందని జైలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీలకు పెట్టే ఆహారం విషయంలో అలసత్వం వహించవద్దని, అధికారులు తీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఖైదీలలో మానసిక పరివర్తన కలగాలని, తరచూ నేరాలకు పాల్పడి జైళ్లకు రావడం మంచి పద్ధతి కాదని అన్నారు. సమాజంలో గౌరవంగా మెలగాలని, నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జైళ్లలో పరిస్థితులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెల్ప్ ఆర్గనైజేషన్ సభ్యుడు వేమిశెట్టి కృష్ణ సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలకు అవసారార్థం రెండు సీలింగ్ ఫ్యాన్‌లు, ఒక ఫ్రిజ్‌ను జడ్జి స్వాతికుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు లాలం రమణమూర్తి, సత్యనారాయణ, ద్వారపురెడ్డి వెంకటరావు, సతీష్‌కుమార్, డి.మోహన్, బి.రాజేష్‌కుమార్, జైల్ సూపరింటెండెంట్ కనకరాజు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ ఆలీ

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మునగపాక ఎస్ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మునగపాక మండలం పాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు నేషనల్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల జీవితం ఎంతో కీలకమైందన్నారు. ఇష్టపడి కష్టపడి చదువుకోవడం ద్వారా మంచి పేరు తీసుకురావచ్చన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


పాటిపల్లిలో ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ హెచ్చరించారు. పాటిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 79, 80 కు సంబంధించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు అందిన ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం సర్వే చేయించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులతో సమావేశం

మునగపాక : వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజా ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,సచివాలయ కన్వీనర్లతో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ హాజరవుతారన్నారు.

డ్వాక్రా రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


జాతీయ గ్రామీణ మహిళల జీవనోపాధి వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

మునగపాక : జాతీయ గ్రామీణ జీవనోపాధి ద్వారా మహిళలు సాధిస్తున్న ఆర్థిక స్వావలంబనపై ఆరా తీసేందుకు పలువురు అధికారులు మండలంలోని మూలపేటలో పర్యటించారు. మూలపేట రామాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. సంఘాల వారీగా సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను ఎంతమేర సద్వినియోగం చేసుకున్నారనే వివరాలు సేకరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని టీమ్ సభ్యులు కోరారు. అనంతరం మండల వ్యాప్తంగా ఉన్న సంఘాలు, రుణ వితరణ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం రమణ, ఏసీ ధర్మారావు,ఏపీఎం కొండమ్మ,సీసీ ప్రకాష్,జాతీయ గ్రామీణ మహిళల జీవనోపాధి అధ్యయన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొరుప్రోలు సర్పంచ్‌గా గోపాలం


గోపాలానికి సర్పంచ్ బాధ్యతలు అప్పగిస్తూ వచ్చిన ఆర్డర్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామ సర్పంచ్‌గా కొరపాటి గోపాలం బాధ్యతలు చేపడుతున్నట్టు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. ఈ నెల 14 న ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న గోపాలాన్ని సర్పంచ్‌గా కొనసాగించాలని అనకాపల్లి డీపీవో శిరిషారావు ఆదేశాలు వచ్చాయని చెప్పారు. గ్రామ సర్పంచ్ పోలవరపు లోవలక్ష్మి ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఈ బాధ్యతలు ఉప సర్పంచ్‌కి అప్పగిస్తూ అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు ఆర్డర్ కాపీని కొరుప్రోలు క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చేతుల మీదుగా గోపాలం తీసుకున్నారు.

మాతృ భాషను నిర్లక్ష్యం చేయొద్దు


తెలుగు భాష పోటీల్లో గెల్చిన విద్యార్థులతో నిర్వాహకులు

అనకాపల్లి రూరల్ : తెలుగు భాషపై నిర్లక్ష్య ధోరణి కారణంగా నేటితరం విద్యార్థులకు తెలుగు సరిగా రాయడం, చదవడం రావట్లేదని తెలుగు భాషా పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహనరావు అన్నారు. సోమవారం అనకాపల్లి గురజాడ స్కూల్‌లో తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు వి.లహరి, బి.దీక్షిత, ఎం.రూప స్వాతి, కె.జాన్విత, డి.భవ్యశ్రీ, భాను శివశ్రీ, డి.కుమార్‌లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో నిరాదరణకు గురవుతున్న మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేందుకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భావితరాలకు తెలుగు లిపి దూరం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పలువురు వక్తలు తెలుగు సాహిత్యం, పద్యాలకున్న ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జి.రంగబాబు, అమర జ్యోతి, గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ హేమలత, మోహన్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీహరిసేన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఇంటింటా గోవిందుడు 1008 కార్యక్రమంలో భాగంగా కల్యాణోత్సవం నిర్వహించినట్టు సమితి వ్యవస్థాపకురాలు దాడి రాజేశ్వరి పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను గవరపాలెం పురవీధులగుండా ఊరేగించారు. స్వామివారి కల్యాణమహోత్సవంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీగా అన్నసమారాధన చేశారు.

22, 23 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్


సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు


హాజరైన వివిధ కమిటీల ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖ ఏడీ ఆడారి రవిబాబు అన్నారు. స్థానిక జీవీఎంసీ మెయిన్ హైస్కూల్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రారంభించనున్నట్టు తెలిపారు. మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపికైన విద్యార్థులు బుధవారం(22న) ఉదయం 7 గంటల్లోపు జిల్లాస్థాయి ప్రదర్శనకు తమ నమూనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ప్రాజెక్టుకు కేటాయించిన గదుల్లో వారి నమూనాలను ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఒక్కో ప్రాజెక్టుకు విద్యార్థితోపాటు ఒక గైడ్ టీచర్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, ఏపీవో వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ అధికారి ఎస్.ప్రసాద్, ఎంఈవో డి.దివాకర్, హెచ్‌ఎం బ్రహ్మాజీ, సైన్స్‌ఫెయిర్ కమిటీల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ కళాశాల తనిఖీ

నక్కపల్లి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలను సోమవారం ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్ తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలలో సదుపాయాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, తాగునీరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల వసతి గదులు తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు.

బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు ప్రారంభం


అనకాపల్లి బైపాస్ నుంచి బొజ్జన్నకొండ జంక్షన్ వరకు పూర్తయిన బ్రిడ్జి

తుమ్మపాల : అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి బొజ్జన్నకొండ జంక్షన్ వరకు గల బ్రిడి నిర్మాణం పూర్తయింది. నిర్మాణ కాంట్రాక్టర్ డీబీఎల్ సంస్థ బ్రిడ్జి పనులు పూర్తిచేయడంతో సోమవారం నుంచి బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. పంటపొలాల మధ్య నుంచి సమారు రెండు కిలోమీటర్ల పొడవు గల బ్రిడ్జి ఏర్పాటుతో అనకాపల్లి పట్టణ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తొలగిపోనున్నాయి. ఇదివరకు విజయవాడ, విశాఖపట్టణం నుంచి వచ్చే భారీ వాహనాలు, సరకు రవాణా వాహనాలు అనకాపల్లి పట్టణంలోకి వచ్చి ఆనందపురం రహదారి వైపు వెళ్లేవి. ఇప్పుడు బ్రిడ్జి పూర్తికావడంతో వాహనాలు నేరుగా ఆనందపురం రహదారికి చేరుకుంటున్నాయి.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉగాది రోజున బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకుడు పి.రంగరాజు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు ఏటా ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు, హెచ్‌ఎం అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

మంత్రి చొరవతో కేజీ రోడ్డుకు మోక్షం


కేజీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి రూరల్: ఏళ్ల తరబడి అధ్వాన స్థితిలో ఉన్న కేజీ రోడ్డు పనులకు మోక్షం లభించింది. గత టీడీపీ హయాంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకోలేదు. దీంతో వాహన చోదకులకు ఈ రోడ్డు నిత్యం నరకాన్ని చూపించింది. స్థానికుల విజ్ఞప్తి మేరకు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపింది. ప్రజల అవస్థల్ని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన గుడివాడ అమర్‌నాథ్ ఈ సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అభ్యర్థన మేరకు కేజీ రోడ్డు పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ.32 కోట్లు మంజూరు చేశారు. దీంతో సోమవారం రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తూరు కాలేజీ జంక్షన్ నుంచి బంగారుమెట్ట వరకు రోడ్డు వేస్తున్నారు. పిసినికాడ పంచాయతీ పరిధి బీఆర్టీ కాలనీ వద్ద గతంలో ఈ పనులకు మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్డు పనులను అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె ధర్మారావు, పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం పరిశీలించారు. కేజీ రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే సుమారు 20 గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్తున్నారు.

660 జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్


వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సహాయకుడు సాయికుమార్

కె.కోటపాడు: గొర్రెలు, మేకలు పారుడు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు ఎ.కోడూరు ఆర్బీకే పశు వైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. ఎ.కోడూరు ఆర్బీకే పరిధిలో 660 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్లు సోమవారం ఆయన తెలిపారు.